## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# మోటర్ల వద్ద పడిగాపులే



### కాంగ్రెస్‌కు అవకాశమిస్తే అంధకారమే

- మూడు గంటల కరెంట్‌తో మునుగుడే
- 10 హెచ్‌పీ మోటర్లు మా నెత్తిన భారమే
- రాక ముందే మాపై ఇన్ని కుట్రలా..?
- ఆ పార్టీని నమ్మేది లేదు.. ఓటేసేదే లేదు
- 24 గంటల కరెంట్‌తోనే మాకు బతుకు
- కేసీఆర్ సారునే గెలిపించుకుంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

జగిత్యాల, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు అవకాశమిస్తే మళ్లీ ఎనకటి రోజులే వస్తాయని, ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ కోసం వ్యవసాయ మోటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని కర్షకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వస్తున్న 24 గంటల ఉచిత కరెంట్ పోతుందని, మళ్లీ మూడు గంటలే దిక్కవుతుందని హెచ్చరిస్తున్నారు. నాడు నలభై రెండేండ్ల కాంగ్రెస్ పాలన, పదహారేండ్ల టీడీపీ పాలన చూశామని, యాభై ఎనిమిదేండ్ల సమైక్య పాలనలో ఎవరూ ఇవ్వలేని కరెంటును కేసీఆర్ మాత్రమే ఇచ్చారని స్పష్టం చేస్తున్నారు. ఆనాడు సాధ్యం కానిది ఇవ్వాళ ఎలా సాధ్యమైందంటే.. ఈ ప్రాంత రైతులపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమే కారణమంటున్నారు. సాగునీరు, 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా వంటివి ఇస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమకు అండగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. డెబ్బై ఆరేండ్ల స్వతంత్ర దేశ చరిత్రలో.. నేటికీ ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నది కేసీఆర్ మాత్రమే అని ప్రశంసిస్తున్నారు. కొన్నేళ్లుగా కరెంట్ కష్టాలు లేవని, తమకు నచ్చిన సమయంలో వెళ్లి మోటర్లు పెట్టి సాగు చేసుకుంటున్నామని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నేతలు కరెంట్‌పై పూటకో మాట చెబుతూ పరేషాన్ చేస్తున్నారని, వారిని నమ్మితే మళ్లీ మోటర్ల కాడ జాగారం చేయక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, అందుకే మళ్లీ 3 గంటలు అని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారని మండిపడుతున్నారు. అసలు కరెంట్ మంచిగున్న చోట మళ్లీ కరెంట్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని, కర్ణాటకలో ఐదు గంటల కరెంటే సక్కగ ఇవ్వకుండా ఇక్కడ ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నిస్తున్నారు. సద్ది తిన్న రేవు తలువాలంటే.. మనకు మేలు చేసిన వారికి అండగా నిలువాల్సిన అవసరముందని చెబుతున్నారు. కరెంట్, నీళ్లకు ఏబాధా లేకుండా చేసిన కేసీఆర్ వెంటే తాము స్పష్టం చేస్తున్నారు.

### ❖ 10 హెచ్‌పీ మోటార్లు కాలుతాయ్..



కాంగ్రెస్ నాయకులు 10హెచ్‌పీ మోటార్లతో 3 గంటల కరెంటు చాలు అంటున్నారు. 10 హెచ్‌పీ మోటార్లను బోర్లను బావిలో దించితే నీళ్లను ఒక్కసారిగా గుంజుతయి. ఆ తర్వాత మోటార్ పంపులో నీళ్లు అందక మోటర్లు కాలుతయ్. ఎవుసం తెలియని నాయకులు మోసం చేసే మాటలు మాట్లాడుతున్నారు. కాంగ్రేసోళ్ల మాటలకు రైతులు ఆందోళన చెందుతున్నరు. 3 గంటల కరెంటుతో 10హెచ్‌పీ మోటార్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు ఆగుతయా..? కాంగ్రేసోళ్లకు ఎవుసం గురించి ఏమైనా తెలు సా..? వీళ్లు మాట్లాడుతున్న మాటలకు వాళ్లకు ఓటు ఎవరూ వేయరు. ఎవుసాన్ని పండుగ చేసిన సీఎం సారును మేం మరువం. మళ్లా గెలిపిస్తాం.

**- పడిగెల స్వామిరెడ్డి, అంతర్గాం(జగిత్యాల రూరల్ మండలం)**

### మూడుగంటల కరెంటుతో బతికేదెట్లా

మూడుగంటల కరెంటు వ్యవసాయానికి ఎట్లా సరిపోతుంది. మూడు గంటల కరెంటుతో ఒక్కదొయ్యకూడా పారదు. ఆ మూడు గంటలు కూడా ఎప్పుడు వస్తదో కూడా తెలియదు. మాకు ఎనుకటి కాలం గుర్తుకువస్తుంది. ఎనుకట కరెంటు వత్తదో రాదోనని ఎపుడు కంటిమీద కునుకు లేకుండా బాయికాడనే పడుకునేటోళ్లం. కాంగ్రెస్ అంటున్నట్లు 10 హెచ్‌పీ మోటార్లు పెడితే అంత ఖర్చు రైతులు భరించలేరు. రైతులను ఆగం చేసేందుకే కాంగ్రెస్ నాయకులు అట్లా మాట్లాడుతున్నరు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్న కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్‌కు ఓటు వేయం. రైతులంతా కేసీఆర్ సారుతోనే ఉండి మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాం.

**- కొప్పెల పెద్దరాజరెడ్డి, రైతు, వెల్లుల్ల గ్రామం, మెట్‌పల్లి మండలం**

### ❖ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తినే అన్నంలో మన్ను పోసుకున్నట్లే



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. వరి సాగు చేస్తున్నా. ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంటు ఇస్తూ, రైతు బంధు ఇస్తండు. దీన్ని కాదని కాంగ్రెస్‌కో, బీజేపీకో ఓటు వేస్తే తినే అన్నంలో మన్ను పోసుకున్నట్లే అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. రాత్రి పూట పొలం వద్ద కావలి పండుకొని కరెంటు పెట్టుకొనే వాళ్లం. మా గ్రామంలో చాలా మంది రాత్రి కరెంట్ వేయడానికి పోయి కరెంటు షాక్‌లకు గుర్రై మరణించారు. ఆ కాలంలో పొలం సాగు చేయాలంటే కత్తిమీద సాములా ఉండేది. ఇప్పుడు ఎప్పుడు తీరిక ఉంటే అప్పుడు పొయ్యి కరెంట్ పెట్టి నీళ్లు పారిత్తన్నం. ఈ పదేండ్లు కరెంట్ విషయంలో పెద్ద కష్టమేం కాలే. కానీ కాంగ్రెస్ నాయకులు మేమత్తే మూడు గంటల కరెంట్ ఇస్తా అంటండు. ఇక్కడ సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తాంటే మేం మూడు గంటల కరెంట్ ఇస్తా అని కాంగ్రెసోళ్లు అంటాంటే జనాలు నవ్వుతర్రు.

**- ద్యాగల రాజం, రైతు, ధరూర్**



### ❖ 10 హెచ్‌పి మోటర్లు పెడితే కరెంటు ఎలా ఇస్తరు



రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. అసలు రైతులు పంట పొలాలకు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటారా. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయం గురించి తెలియక మాట్లాడుతున్నారు. చాలా మంది సన్న, చిన్న కారు రైతులు ఉంటరు. వారు 10 హెచ్‌పీ మోటరు పెట్టుకుని ఏమి చేస్తారు. అసలు వీటిని పెట్టుకుంటే కరంటు ఎట్లా ఇస్తారు. అందరు రైతులు ఒకే సారి మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు పని చేస్తాయా. వాటి సామర్థ్యం ఎంత ఉంటుంది అనే కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. గసోంటోళ్లకు ఓటు వేస్తరా.. కాంగ్రెసోళ్లు మాటాలకు అర్థంలేదు.. పర్థం లేదు.

**- పొట్లపల్లి రవీందర్‌రావు, రైతు, పెగడపల్లి మండలం**

### ❖ 10 హెచ్‌పీ పంపు కొనుక్కొనే పరిస్థితి నాకు లేదు



రైతులు 10 హెచ్‌పీ పంపు కొనుక్కొని మూడు గంటలు పొలానికి నీరు పారిస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటున్నాడు. రైతులకు ఉచితంగా ముందు 10 హెచ్‌పీ పంపు కొనిస్తాడా. 3 హెచ్‌పీ పంపుతో నా రెండు ఎకరాల పొలానికి నీరు పారిస్తున్నా. కేసీఆర్ ప్రభుత్వంలో ఎటువంటి చింత లేకుండా పంటలు పండిస్తున్నా. ఇప్పుడ 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటే అడ్డగోలు పైసలు కావాలె. రైతు బంధు పైసలు పడుతన్నయ్. రైతులకు ఇప్పుడు కండ్ల నిండ పైసలు కనిపిస్తన్నయి. అసోంటిది మళ కాంగ్రెసోళ్లను నమ్మి లేనిపోని ఇబ్బందులను కొని తెచ్చుకుంటమా. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తుంది.

**- కనక రవి, గొల్లపల్లె**

### ❖ పొలం పనులు చేయలేక దుబాయి పోయిన

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడక ముందు రాత్రి పూట పొలం వద్ద కావలి ఉండి పొలానికి నీరు పారించేటోన్ని. రాత్రంతా నిద్ర లేక ఉదయం పొలం పనులు చేసుకోవడం కష్టంగా ఉండేది. పొలం పనులపై విసిగిపోయి కొన్ని సంవత్సరాలు దుబాయికి వలస వెళ్లిన. ఐదు సంవత్సరాల కింద మళ్ల తిరిగి వచ్చా. మా గ్రామంలో బీడు భూములు లేకుండా పంటలు సాగు చేస్తర్రు. పచ్చటి పంటలతో మా భూములు కళకళలాడుతుంటే ఆశ్చర్యపోయా. మళ్లీ దుబాయ్ లాంటి ప్రాంతాలకు వెళ్లవద్దని పొలం సాగు చేసుకుంటూ ఇక్కడే ఉండిపోయా. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు ఎప్పుడు అవసరం అయితే అప్పుడే పొలంకు నీరు పెట్టుకొని పరిస్థితి వచ్చింది. నేను మూడు ఎకరాల పొలం సాగు చేస్తున్నాను. ఇప్పుడు ఉదయాన్నే పొలానికి వెళ్లి నీరు పారిస్తున్నా. రాత్రి హాయిగా నిద్ర పోతున్నా.

**- గంగారాం, వంజరిపల్లె**



### ❖ కాంగ్రెస్ ఉంటే కరంట్ ఉండదు.

అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ ఉంటే కరెంట్ ఉండదు.. ఇది వందేండ్ల చరిత్ర, ఏ ఒక్కనాడు కూడా కాంగ్రెస్ పార్టీ రైతులకు అవసరమైన కరెంట్ ఎప్పుడూ ఇయ్యలే. ఇచ్చినదాంట్లనే పొలానికి నీళ్లు పారియ్యడానికి అరిగోస పడ్డం. అధికారంలోకి రాక ముందే, రైతులకు మూడు గంటల కరంటు చాలు, వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు, రేపు అధికారంలోకి వచ్చాక కరంట్ కష్టాలు తప్పవు. తొమ్మిదేండ్ల కాలంలో కరంట్, నీళ్ల సమస్యలు లేక పోవడంతో రైతులు రెండు పంటలు పండించుకుని కాలం గడుపుతుంటే, కాంగ్రెస్ నాయకులు కరంటు మూడు గంటలు అని ప్రకటనలు చేయడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

**- తోట రాజిరెడ్డి, రైతు, పెగడపల్లి మండలం**



### ❖ మూడు గంటల కరంటు ఎవరికీ చాలదు

కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి మూడు గంటల కరంటు ఇస్తామని చెబుతోంది. దీని వల్ల రైతుల బతుకులు ఆగం అవుతయి. నీళ్లు ఎక్కువగా ఉండి రైతులు మంచిగా వ్యవసాయం చేసుకుంటే, ఓర్వలేని కాంగ్రెస్ వాళ్లు మూడు గంటల కరంటు చాలని చెప్పడం విడ్డూరంగా ఉంది. నాకు 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నీళ్ల సౌలత్ ఉండడంతో మొత్తం వరి పంటనే వేస్తున్న. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంటు వల్ల ఇబ్బంది లేకుండా పొలం పండుతంది. 3 గంటల కరంట్ ఇస్తే పంటలు ఎట్ల పండుతయి. రైతులు ఎట్ల బతుకుతరు. కొనితెచ్చుంటరా. కేసీఆర్‌ను వదులుకోం. కష్టాలను రానివ్వం.

**- కట్ల తిరుపతిరెడ్డి, రైతు రాములపల్లి, పెగడపల్లి మండలం**